క్లుప్తంగా

'మానవత ' సంస్థకు రూ.25 వేల విరాళం



రూ.25 వేల విరాళాన్ని ఇస్తున్న డాక్టర్ నల్లూరి వెంకటపతి దంపతులు

నల్లజర్ల: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖకు నల్లజర్లకు చెందిన డాక్టర్ నల్లూరి వెంకటపతి, కస్తూరిబాయి దంపతులు రూ.25 వేలు విరాళంగా అందించారు. తమ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు మెచ్చి, వారి 57వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆ దంపతులు శుక్రవారం ఈ మొత్తాన్ని విరాళంగా ఇచ్చినట్టు మానవత సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ తెలిపారు. వెంకటపతి కుటుంబ సభ్యులకు మానవత సంస్థ కృతజ్ఞతలు,అభినందనలు తెలిపింది.

పీహెచ్‌సీల్లో కోవిడ్ ప్రత్యేక వార్డులు

- నియోజకవర్గానికి రూ.58.98 కోట్ల విడుదల
- 100 పడకల ఆసుపత్రిగా దేవరపల్లి పీహెచ్‌సీ
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ ప్రత్యేక వార్డుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వెల్లడించారు. ఆ మంజూరు పత్రాన్ని శుక్రవారం ఆయన దేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని దేవరపల్లి, హుకుంపేట, యాదవోలు, గౌరీపట్నం, నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీల్లో ఈ వార్డులను నిర్మిస్తారని చెప్పారు. ఒక్కో వార్డులో ఆరు బెడ్స్ ఏర్పాటు చేస్తారన్నారు.ఈ వార్డుల ఏర్పాటు కోసం 2021–22లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపగా ఇప్పుడు నిధులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే చెప్పారు. గోపాలపురం నియోజకవర్గంలోని ఆరు పీహెచ్‌సీలకు రూ.58.98 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క పీహెచ్‌సీకి రూ.9.80 లక్షల చొప్పున కేటాయించినట్టు చెప్పారు. కాగా దేవరపల్లి పీహెచ్‌సీని ప్రభుత్వం 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. ఇందుకోసం రూ.27 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం స్థల సేకరణ చేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ హర్షవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లి పీహెచ్‌సీ డాక్టర్‌కు కోవిడ్ వార్డు నిధుల మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తలారి

పొగాకు ధరలు ఆశాజనకం

గోపాలపురం: వర్జీనియా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అధైర్య పడాల్సిన పనిలేదని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య అన్నారు. స్థానిక వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్ఎం ఆదిశేషయ్య మాట్లాడుతూ లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లకు ఎక్కువ కంపెనీలు పోటీ పడుతున్నాయన్నారు. సరాసరి ధర కిలోకు గరిష్టంగా రూ.205.08 పలుకుతోందన్నారు. ఈ రకం పొగాకు గతంలో ఎన్నడూ ఇంత రేటు పలకలేదన్నారు. రైతులు నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేశారని ఆయన కొనియాడారు. 1060 పొగాకు బేళ్లు వేలానికి రాగా, వాటిలో 968 బేళ్లు అమ్ముడుపోయాయని తెలిపారు. పది కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారని చెప్పారు. అత్యధిక ధర రూ. 210, అత్యల్పంగా రూ.170 ఉందన్నారు. వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఆదిశేషయ్య కొనుగోలుదారులకు సూచించారు. వేలం నిర్వహణాధికారి సి.అశోక్, సీనియర్ గ్రేడింగ్ అధికారి ఎస్. హేమస్మిత, రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, కార్యదర్శి ఇల్లూరి రాంబాబు, ఉపాధ్యక్షుడు ముల్లంగి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

దేవరపల్లి: స్థానిక మూడు రోడ్ల కూడలిలో దేవరపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ కడిమి వీరకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రజలు దాహార్తి తీర్చు కుంటున్నారు.అలాగే స్థానిక బస్టాండ్ వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు డి.సుర్దరాజు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

'ఉపాధి' టెక్నికల్ అసిస్టెంట్‌గా లక్ష్మణ్

ఉండ్రాజవరం: ఉపాధి హామీ పథకం మండల సాంకేతిక సహాయకునిగా పి.లక్ష్మణ్ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన టెక్నికల్ అసిస్టెంట్ జి.కాంతారావు నిడదవోలు మండలానికి బదిలీపై వెళ్ళినట్లు ఎంపీడీఓ శ్రీనివాసు తెలిపారు.

కాపు సంక్షేమ సంఘ యూత్ అధ్యక్షుడిగా సాయిరామ్



ఉండ్రాజవరం: కాపు సంక్షేమ సంఘం మండల యూత్ ప్రెసిడెంట్‌గా తాడిపర్రు గ్రామానికి చెందిన వెలుగున సాయిరామ్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా యూత్ ప్రెసిడెంట్ గుణ్ణం శ్యామకుమార్ శుక్రవారం ప్రకటించారు.

రైస్‌మిల్లుల్లో తహసీల్దార్ తనిఖీలు

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల శివార్లలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర రైస్‌మిల్లులో తహసీల్దార్ ఎం.గంగరాజు శుక్రవారం తనిఖీలు జరిపారు. తాము సరఫరా చేసిన ధాన్యంలో నూక శాతం ఎక్కువ ఉందంటూ తమ వద్ద ఆ మిల్లర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ రైతులు చేసిన ఫిర్యాదు మేరకు తామీ తనిఖీలు చేశామని తహసీల్దార్ తెలిపారు. రైతుల ఫిర్యాదుపై నూక శాతాన్ని పరిశీలించామని, ఈ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. మిల్లర్లకు డబ్బులు చెల్లించవద్దని ఆయన రైతులకు సూచించారు. తనిఖీల్లో సివిల్ సప్‌లై డీటీ సత్యనారాయణ, ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వో సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రేషన్ అందజేత



వాత్సల్య వృద్ధాశ్రమానికి రేషన్ అందిస్తున్న నాయకులు

కొవ్వూరు: పట్టణానికి చెందిన కుప్పాల బులిస్వామినాయుడి రెండో వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన కుమారుడు కుప్పాల శ్రీనివాస్ స్థానిక వాత్సల్య వృద్ధాశ్రమానికి నెలకు సరిపడా బియ్యం బస్తాలతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. సరుకులను ఆయన స్నేహితుల ద్వారా శుక్రవారం ఆశ్రమానికి అందజేశారు. యాళ్ల నరసింహారావు, నగ్గలపాటి శ్రీనివాస్, అడ్డూరి సుబ్బారావు, రుద్రం వీరబాబు, యర్రంశెట్టి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరులో మెగా లోక్ అదాలత్

కొవ్వూరు: ఈనెల 13న కొవ్వూరులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ శుక్రవారం తెలిపారు. రాజీ పడదగిన అన్ని రకాల కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు., కుటుంబ తగాదాలు, సివిల్, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ కేసుల వంటి వాటిని లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. నలుగురు జడ్జిలతో నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు న్యాయమూర్తి అన్నపూర్ణ తెలిపారు.

13 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

నల్లజర్ల: మండలంలోని మొత్తం 14 రెవెన్యూ గ్రామాలకు గాను 13 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూముల రీసర్వేకు సంబంధించి డ్రోన్ సర్వే పూర్తయినట్టు తహసీల్దార్ వి.కిశోర్‌కుమార్ వెల్లడించారు. నల్లజర్ల రెవెన్యూ గ్రామానికి సంబంధించి నల్లజర్ల జెడ్పీ హైస్కూలు, పుల్లలపాడులలోని రెండు పాయింట్ల ద్వారా శుక్రవారం డ్రోన్ సర్వే చేశారు. రీసర్వే పనుల్లో పక్కా పారదర్శకత, నాణ్యతకు తోడు వేగంగా పూర్తి చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు కిశోర్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి వేధిస్తున్న భూ సమస్యలను శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న భూహక్కు–భూరక్ష పథకాన్ని తీసుకు వచ్చినట్టు వివరించారు. వీఆర్వోలు లక్ష్మణమూర్తి, సురేష్, రాంబాబు, శాంతి, సర్వేయర్లు, నరేంద్ర, జాన్, సజీవ వర్మ, నరేష్ పాల్గొన్నారు.

వీవీ వినాయక్ హిందీ 'ఛత్రపతి' రిలీజ్ సందడి

చాగల్లు: ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం ఛత్రపతి విడుదల సందర్భంగా శుక్రవారం ఆయన స్వగ్రామం చాగల్లులో అభిమానులు సందడి చేశారు. అభిమానుల కోసం వీమాక్స్ థియేటర్‌లో ప్రత్యేక ప్రీ షో ప్రదర్శించారు. భారీఎత్తున బాణసంచా కాల్చారు. అందరికి స్వీట్లు పంచి పెట్టి సంబరాలు జరిపారు. శుక్రవారం నాడు దేశవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రాన్ని మన రాష్ట్రంలో మల్టిప్లెక్స్ థియేటర్లలో మాత్రమే ప్రదర్శిస్తున్నారని ఆయన సోదరుడు, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ తెలిపారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా మాట్లాడుతూ తెలుగులో డైనమిక్ డైరెక్టర్ అయిన వినాయక్, బాలీవుడ్ ప్రేక్షకుల అంచనాలకు తగట్టుగా హిందీలో కూడా ఛత్రపతి సినిమా రూపొందించారన్నారు. కార్యక్రమంలో త్రివేణీ గ్లాస్ ఫ్యాక్టరీ డైరెక్టర్ ఫాణిగ్రాహి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, ఉప సర్పంచ్ ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్, వైఎస్సార్ సీపీ నిడదవోలు మండలశాఖ అధ్యక్షుడు అయినేడి పల్లారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌ల పంపిణీ

పెరవలి: మండలంలోని 27 మంది దివ్యాంగులకు శుక్రవారం ఆర్టీసీ సిబ్బంది బస్ పాస్‌లు అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ చేతులమీదుగా దివ్యాంగులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్ పాస్‌ల సాయంతో దివ్యాంగులు, వారి సహాయకులు రెండేళ్ల వరకూ 50 శాతం రాయితీతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. అర్హులైన దివ్యాంగులు ఎవరైనా ఉంటే తణుకు డిపోకు వెళ్ళి ఈ పాస్‌లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, సీనియర్ అసిస్టెంట్ అరిగెల వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ముగ్గురి బైండోవర్

తాళ్లపూడి: సారా తయారీ కేసులో నిందితులైన మండలానికి చెందిన ముగ్గురిని శుక్రవారం తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ అయిన టి.రాధిక ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్ఈబీ సీఐ వి.సత్యనారాయణ తెలిపారు. మలకపల్లికి చెందిన కొల్లి శ్రీనివాస్, రాగోలపల్లికి చెందిన పానుకుమాటి వీర్రాజు, తిరుగుడుమెట్టకు చెందిన వలసాని సతీష్ బైండోవర్ చేసిన వారిలో ఉన్నారని సీఐ చెప్పారు.

నేటి నుంచి ఆలయ ప్రారంభోత్సవ పూజలు



పంచముఖ అంజనేయస్వామి వారు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో పునఃనిర్మించిన పంచముఖ అంజనేయస్వామి వారి ఆలయ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. భక్తుల విరాళాలు సుమారు రూ.15 లక్షల వ్యయంతో గ్రామంలో కొత్తగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఈనెల 13న శాంతి హోమం, 14న హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయ పునఃప్రారంభం, 108 మార్లు హనుమాన్ చాలీసా పారాయణ, 15న అంజనేయ హోమం, 16న సుందరకాండ పారాయణ, అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు.

14 నుంచి రావిమెట్లలో హనుమజ్జయంతి

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల గ్రామంలో కొలువైన అభయాంజనేయస్వామి వారి 16వ జయంతి మహోత్సవాలను ఈ నెల 14 నుంచి 18 వరకూ నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 14న హనుమాన్ చాలీసా పారాయణ, 15న ఏకాహం, 16 సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని వారు వివరించారు.

తాడిపూడిలో ఘనంగా ముత్యాలమ్మ జాతర

తాళ్లపూడి: మండలంలోని తాడిపూడి గ్రామ దేవత ముత్యాలమ్మ వారి జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. జాతరకు బంధువులు, ఆడపడుచుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గురువారం రాత్రి రాజమహేంద్రవరానికి చెందిన ప్రసాద్ ఆర్కెస్ట్రా వారి సినీ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆసాదుల, గరగ నృత్యాల వంటి కార్యక్రమాలు జరిగాయి. గ్రామస్తులు ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.